క్లుప్తంగా

గురుజాల హుండీ ఆదాయం రూ.5.47 లక్షలు

నందవరం : గురజాల రామలింగేశ్వరస్వామి క్షేత్రం హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు. ఆలయ ప్రధాన హుండీతో పాటు, శివరాత్రి వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన ధర్మహుండీ కానుకలను లెక్కబెట్టారు. ప్రధాన హుండీ నుంచి రూ.2.34లక్షలు, ధర్మహుండీ ద్వారా రూ.88,189 నగదు వచ్చింది. అలాగే అర్చన, అభిషేకం టికెట్లు నుంచి రూ.1,94,500, చందాలు, కల్యాణం ద్వారా రూ.29,437 నగదు సమకూరింది. మొత్తం ఆదాయం రూ.5,47,108 సమకూరినట్లు ఆలయ ఈవో రాంప్రసాద్ వివరించారు. ఆదోని డివిజన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు శివారెడ్డి, రాజేశ్వరరెడ్డి, హంపేష్‌స్వామి పాల్గొన్నారు.

గురజాలలో కబడ్డీ పోటీలు

నందవరం : మహా శివరాత్రి వేడుకలను పురస్కరించుకుని మండలంలోని గురజాలలో శుక్రవారం ఓపెన్ కబడ్డీ పోటీలు నిర్వహించారు. గురురాజ్ దేశాయ్, సర్పంచ్ వీరస్వామి ప్రారంభించారు. పోటీలో 28 జట్లు పాల్గొనగా..మొదటి రోజు 5 జట్లు విజయం సాధించాయి. శనివారంతో పోటీలు ముగియనున్నాయి. పోటీల విజేతలకు వరుసగా.. రూ.25 వేలు, రూ.15 వేలు, రూ. 10 వేలు, రూ.5 వేలు అందజేస్తామని నిర్వాహకులు భీమన్న, హనుమంతు తెలిపారు.

ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించే ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ తాలుకా అధ్యక్షు,కార్యదర్శులు వీరేష్, తిమ్మగురుడు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహారెడ్డి, విజయేంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో మాట్లాడారు.

ప్రహరీ నిర్మాణానికి సహకరించండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని అంబా భవానీ ఆలయ ప్రహరీ నిర్మాణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి నిర్మాణానికి సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి, తహసీల్దార్ శేషఫణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆలయ స్థలం ఆక్రమణలకు గురికాకుండా ప్రహరీ నిర్మాణం చేపడుతున్నామని, సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగుల డెత్ క్లెయిమ్స్ ఇవ్వకపోవడం శోచనీయం

ఎమ్మిగనూరుటౌన్: అనారోగ్యంతో, ప్రమాదవశాత్తు మృతి చెందిన ఉద్యోగ,ఉపాధ్యాయులకు ఏపీజీఎల్ఐ మెచ్యూరిటీ, డెత్ క్లెయిమ్స్ రెండేళ్లు గడిచినా ఇవ్వకపోవడం శోచనీయమని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పి.మాదన్న అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం డీఏ,పీఆర్సీ బకాయిల చెల్లింపులు వేల కోట్లలో ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు.

ఉరుకుందలో ఘనంగా లక్ష పుష్పార్చన

కౌతాళం: అమావాస్యను పురస్కరించుకుని ఉరుకుంద ఈరన్నస్వామిని దర్శించుకునేందుకు శుక్రవారం వేలాది మంది భక్తులు వచ్చారు. తెల్లవారు జామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. పలువురు లక్ష పుష్పార్చన పూజల్లో పాల్గొని భక్తిని చాటుకున్నారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

నందవరం : ప్రజా పంపిణీ వ్యవస్థలో పేదలకు ఇంటింటికీ రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లను తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. 1–15 వ తేదీ లోపు రేషన్ పంపిణీ 90 శాతం పూర్తి చేయాలన్నారు. ఆర్ఎస్‌డీటీ మహేష్ పాల్గొన్నారు.

ఆదోనిలో 7 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు

ఆదోని సెంట్రల్: పట్టణంలో ఏడు కేంద్రాల్లో ఇంటర్మీడియెట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం నుంచి పరీక్షలు జరగనున్నాయి. ఆదోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, అక్షరశ్రీ, నారాయణ, బాలజీ, సాయి జూనియర్ కళాశాల, ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రెండు కేంద్రాలు చొప్పున మొత్తం 7 కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించనున్నారు. సుమారు 3,500 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండనుంది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులు ఆలస్యం చేయకుండా ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు తెలిపారు.

సైన్స్ ఫెస్టివల్

- ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం
- సీవీ రామన్‌కు ఘన నివాళి
- ఆకట్టుకున్న విద్యార్థుల సైన్స్ ప్రాజెక్టులు

ఆదోని సెంట్రల్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలు, కళాశాలల్లో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సైన్స్ ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఆయా పాఠశాలలలు, కళాశాలల్లో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఆదోని నెహ్రూమెమోరియల్ ఉన్నత పాఠశాల, లెబర్ కాలనీలోని పురపాలక ఉన్నత పాఠశాల, ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విద్యార్థులు వివిధ అంశాలపై వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. మిల్టన్ పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులు అర్పించి ఆయన సేవలను వివరించారు.

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్ సీవీ రామన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ మహబూబ్‌బాషా పూలమాల వేసి నివాళులర్పించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. అధ్యాపకులు డాక్టర్ క్రాంతికుమార్,పాల్‌దేవపాల్, శ్రీనుబాబు,ధనుంజయ, డాక్టర్ సుశీలమ్మ పాల్గొన్నారు.

పరిశోధనాసక్తి పెంపు..

విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకత, పరిశోధనా సక్తిని వెలికి తీసేందుకు సైన్స్‌ఫేర్‌లు ఉపయోగపడతాయని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెఎస్. రఘు పేర్కొన్నారు. నారాయణ పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్‌ఫేర్‌ను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ అనురాధ పాల్గొన్నారు.



ఆదోని: సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయవచ్చు..

ఎమ్మిగనూరురూరల్: ప్రయోగాల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయవచ్చునని ప్రిన్సిపాల్ పద్మావతి పేర్కొన్నారు. బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో సీవీ రామన్ చిత్రపటానికి నివాళు లర్పించారు. అలాగే పట్టణంలోని భాష్యం స్కూల్‌లో ప్రిన్సిపాల్ మచాని కవిత ఆధ్వర్యంలో సైన్సు దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు.

గోనెగండ్ల: విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలతో ఉంటేనే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోగలని ఎంఈఓ-2 నీలకంఠ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వేముగోడు, గంజిహళ్లి తదితర గ్రామాల్లోని పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

నందవరం : స్థానిక జెడ్పీ పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్ఎం ప్రసాద్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు చేసిన సైన్స్ నమూనాలను పరిశీలించారు.







ఆదోని: సైన్సు ఉపాధ్యాయులకు సన్మానం, ఎమ్మిగనూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో.., ఎమ్మిగనూరు: సైన్స్‌ఫేర్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

వైభవంగా ఆంజనేయస్వామి పల్లకోత్సవం



పల్లకోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని ఎరిగేరి గ్రామ కొండల్లో వెలసిన శ్రీపులిగట్టు ఆంజనేయస్వామి పల్లకోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. రాత్రి 8 గంటలకు ప్రారంభమైన ఈ వేడుకను తిలకించడానికి చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలే కాక కర్ణాటక, మహారాష్ట్ర తదితర సుదూర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. వారంతా స్వామి సన్నిధిలో పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పల్లకోత్సవంలో పాల్గొన్న ప్రదీప్‌రెడ్డి

పులిగట్టు అంజనేయస్వామి పల్లకోత్సవంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా ఆలయకమిటీ నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈయన వెంట గ్రామ సర్పంచ్ గోవిందు, గ్రామ ఇన్‌చార్జ్ నీలకంఠరెడ్డి, మండల కన్వీనర్ ప్రహ్లాదచారి, వైస్ఎంపీపీ బుజ్జిస్వామి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు

ఆదోని రూరల్: ఆదోని డివిజన్ పరిధిలో అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు ముగిశాయని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ తెలిపారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరిగాయియన్నారు. డివిజన్‌లో అంగన్‌వాడీ వర్కర్స్ 06 ఖాళీలు ఉన్నాయని, 25 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇందులో 23 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరయ్యారన్నారు. అంగన్‌వాడీ హెల్పర్స్ 40 ఖాళీలు ఉండగా, 174 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని.. వీరిలో 154 మంది హాజరయ్యారని వెల్లడించారు. త్వరలో ఎంపికైన వారి పేర్లు ప్రకటిస్తామని తెలిపారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మలదేవి, డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి, సీడీపీఓలు ఉమామహేశ్వరి, సఫర్నిషాబేగం, నాగమణి, శశికళ తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

నందవరం : ఉత్తమ సేవలతో ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని డిప్యూటీ ఈఓ వెంకటరమణా, ఎంపీడీఓ పుల్లయ్య, ముగతి గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంఈఆర్సీ భవనంలోని ఆవరణలో ఎంఈఓ-2 రఘునాథ్ ఆధ్వర్యంలో ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి పదవీ విరమణ సన్మాన కార్యక్రమం అధికారులు, ఉపాధ్యాయులు నిర్వహించారు.సుదర్శన్‌రెడ్డి దంపతులను డిప్యూటీ ఈఓ, మాజీ ఎంఈఓలు, ఎంఈఓలు, మాజీ హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. మాజీ ఎంఈఓలు రాజారత్నం, శివరామ్, ఆలురు ఎంఈఓ కోమలాదేవి, హెచ్ఎంలు శివరాం, ప్రసాద్, ఈశ్వరరెడ్డి, ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు దేవసహాయం, కర్రె కృష్ణ, ఎల్లప్ప పాల్గొన్నారు.



ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

చర్మకారుల దుకాణాలకు రక్షణ కల్పించాలి




మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న చర్మకారులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో దళిత చర్మకారులు ఏర్పాటు చేసుకున్న దుకాణాలకు రక్షణ కల్పించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంథోని, సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు గోవిందులు డిమాండ్ చేశారు. ఏపీ దళిత చర్మకారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి వినతిపత్రాన్ని కమిషనర్ గంగిరెడ్డికి అందజేసి మాట్లాడారు. పట్టణంలోని కూడళ్లలో వృతి పని కోసం ఏర్పాటు చేసుకున్న చిన్న బంకులను మున్సిపల్ అధికారులు రాత్రి వేళల్లో తొలగిస్తున్నారని పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. రమేష్, రాజు,ఆనంద్, బాబు పాల్గొన్నారు.

రమణీయం.. రథోత్సవం

పెద్దకడబూరు : మండల కేంద్రం పెద్దకడబూరులో సిద్దారూఢ స్వామి రథోత్సవం శుక్రవారం అశేష భక్తజనుల మధ్య వైభవంగా సాగింది. ఉదయం ఆలయ అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతర సాయంత్రం ఆలయం నుంచి సిద్దారూఢస్వామి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల గుండా కలశాలు, మేళ తాళాలతో, ఊరేగింపుగా తీసుకొని రథంపై కూర్చోబెట్టారు. అనంతరం గ్రామ పెద్దలు రెడ్డి రామలింగా రెడ్డి ఇంటి నుండి సర్కార్ కుంభాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం శివనామ స్మరణ మధ్య రథాన్ని ముందుకు కదిలించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి, ఎంపీపీ శ్రీవిద్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రాంమ్మోహన్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కమిటీ వింగ్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యుడు విజయేంద్రరెడ్డి, సర్పంచ్ రామాంజినేయులు, మాజీ ఎంపీపీ రఘురాముడు, గ్రామపెద్దలు రామలింగా రెడ్డి మొక్కులు తీర్చుకున్నారు.



అశేష భక్తజనుల మధ్య స్వామివారి రథోత్సవం

ప్రణాళికతోనే లక్ష్య సాధన

ఆదోని అర్బన్: క్రమశిక్షణ, ప్రణాళికతో విజయం సొంతం అవుతుందని జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్, ఏపీఎస్పీ కర్నూలు రెండో బెటాలియన్ కమాండెంట్ ఎం.దీపిక పాటిల్ సూచించారు. శుక్రవారం రాత్రి ఎమ్మిగనూరు రోడ్డులోని వాసవీ కన్వెన్షన్ హాల్‌లో స్టోన్ హిల్ ఇంటర్నేషనల్ పాఠశాల వార్షికోత్సవంలో ఎస్పీ దంపతులు పాల్గొన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. చదువులో పిల్లల ఇష్టాలను గుర్తించి అందుకు అనుగుణంగా వారిని ప్రోత్సహించాలన్నారు. ప్రణాళిక ప్రకారం ఇష్టపడి చదివితే మంచి మార్కులు సాధించవచ్చని చెప్పారు. లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకెళితే విజయం సాధించవచ్చని సూచించారు. అనంతరం విద్యార్థుల డాన్స్‌లు అలరించాయి. ఆదోని డీఎస్పీ హేమలత, సీఐలు శ్రీరామ్, సూర్యమోహన్‌రావు, రామలింగయ్య, గంటా సుబ్బారావు, పాఠశాల చైర్మన్ శశిరేఖ, మేనేజింగ్ ట్రస్టీ పంచాక్షరప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

విరుపాపురంలో కమ్యూనిటీ హాల్ ప్రారంభం

ఆదోని రూరల్: మండలంలోని విరుపాపురం గ్రామంలో శుక్రవారం ఆర్డీటీ సముదాయ భవనం (పాఠశాల మరియు కమ్యూనిటీ హాల్)ను వైఎస్సార్‌సీపీ నాయకుడు, సర్పంచ్ ప్రహ్లాద్‌యాదవ్, ఆర్డీటీ చైర్‌పర్సన్ సరస్వతి ప్రారంభించారు. సరస్వతి మాట్లాడుతూ.. సముదాయ భవనానికి సర్పంచ్ స్థలం కేటాయించి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యాభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలి

ఆదోని సెంట్రల్: విద్యాభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతం నిధులను కేటాయించాల్సి ఉండగా కేవలం 9.88 శాతం కేటాయించడం సరికాదని ఎస్టీయూ సహాధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్, లోక్యనాయక్ అన్నారు. శుక్రవారం పురపాలక ఉన్నత పాఠశాల ఎదుట భోజన విరామ సమయంలో ఎస్టీయూ నాయకులు నిరసన తెలిపారు.

రసాభాసగా మున్సిపల్ సమావేశం

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపాలిటీలో పెండింగ్‌లో నున్న బకాయిలపై వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్ పేరును టీడీపీ కౌన్సిలర్ దయాసాగర్ ప్రస్తావించడంతో తనకు సంబంధం లేని అంశంపై తన పేరు ఎలా ప్రస్తావిస్తారంటూ వైస్ చైర్మన్ ప్రశ్నించడంతో ఇరువురి మధ్య వాగ్వాదం మొదలైంది. శుక్రవారం చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో సాధారణ సమావేశం జరిగింది. సంబంధం లేని అంశంలో తన పేరును ప్రస్తావించడం ఎంతవరకు సమంజసమంటూ వైస్ చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పార్టీ ఫిరాయించిన కౌన్సిలర్ అమాన్ మాట్లాడుతూ.. కూర్చో అంటూ వైస్ చైర్మన్ పట్ల అమర్యాదగా సంభాషించడంతో.. ఇరు పార్టీ కౌన్సిలర్ల మధ్య వాదన చోటు చేసుకుంది. కూర్చోమని చైర్మన్ చెప్పాలి కానీ.. పార్టీ ఫిరాయించిన నీవా తనకు చెప్పేది అని వైస్ చైర్మన్ నిలదీశారు. నీవు చేసే నకిలీ ఇంటి పట్టాల వ్యవహారం తెలియదనుకుంటున్నావా అంటూ నిలదీశారు. దీంతో పార్టీ ఫిరాయింపు కౌన్సిలర్లు వైస్ చైర్మన్ వైపు దూసుకు రావడంతో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు వారిని అడ్డుకున్నారు. ఇరుపార్టీల కౌన్సిలర్లను చైర్మన్ ఎంత వారించినా వినకపోవడంతో చివరికి సమావేశాన్ని ముగిస్తున్నట్లు ప్రకటించారు. అంతకు ముందు వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, కౌన్సిలర్ ఖాశింబేగ్ మాట్లాడుతూ రంజాన్ మాసం ఉన్నందున మసీదులు,ఈద్గాల్లో పారిశుద్ధ్య పనులు,మంచినీటి వసతి, వీధి లైట్లను వేయాలని వారు చైర్మన్ దృష్టికి తెచ్చారు. సూపర్‌సిక్స్ పథకాలపై వైస్ చైర్మన్ టీడీపీ కౌన్సిలర్‌లను నిలదీశారు. అలాగే..కౌన్సిలర్ సుధాకర్ మాట్లాడుతూ తన వార్డులో కుళాయిల ద్వారా నీరు వృథా అవుతుందని, అరికట్టాలని కోరారు. మినీ ట్యాంక్‌ల నిర్వహణ సరిగా లేకపోవడంతో నీరు ఓవర్‌ఫ్లో అవుతుందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అజెండాలోని 34 అంశాలతో పాటు టేబుల్ అజెండాను సభ్యులు ఆమోదించారు. మున్సిపల్ డీఈలు నీరజ,రాజునాయక్, మేనేజర్ వరప్రసాద్, ఆర్ఓ అస్లాంబాషా పాల్గొన్నారు.



వాగ్వాదానికి దిగిన సభ్యులను వారిస్తున్న మున్సిపల్ చైర్మన్ రఘు



వైస్ చైర్మన్ వైపు దూసుకొస్తున్న టీడీపీ కౌన్సిలర్లను అడ్డుకుంటున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

అన్నదానానికి రూ. 50 వేలు విరాళం



దాతకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత నిత్య అన్నదానానికి భక్తులు విరివిగా విరాళాలు అందజేసి తమ భక్తిని చాటుకుంటున్నారు. శుక్రవారం కర్నూల్ వాస్తవ్యులైన గాజుల రాజేశ్వరి కుంటుంబ సభ్యులు రూ.50 వేలు అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. దాతకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

కౌతాళం: ఎరిగేరిలోని పులిగట్టుఆంజనేయ స్వామిని శుక్రవారం ఉదయం ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, టీటీడీ దేవస్థానం మాజీ మెంబర్ సీతారాంరెడ్డి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వీరికి గ్రామ సర్పంచ్ గోవిందు, నాయకుడు నీలకంఠరెడ్డి స్వాగతం పలికారు. వీరి వెంట నాయకులు మహేందర్‌రెడ్డి, కోసిగి మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

నాటుసారాను నిర్మూలిద్దాం

పెద్దకడబూరు: కలిసికట్టుగా గ్రామాల్లో నాటుసారా నిర్మూలిద్దామని ఎక్సైజ్ సీఐ భార్గవరెడ్డి సూచించారు. కల్లుకుంట గ్రా మంలో శుక్రవారం నాటుసారా రహిత సమాజ నిర్మాణం కోసం అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. నారాకు దూరంగా ఉంటామని ప్రజలచేత ప్రతిజ్ఞ చేయించారు. సారా తయారు చేసినా, అమ్మినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

కౌతాళం: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయం ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, ఎంపీపీ అమరేష్ అన్నారు. కౌతాళం ఎంపీడీఓ సుబ్బరాజు శుక్రవారం పదవీ విరమణ పొందడంతో సన్మానించారు. మండల కన్వీనర్ ప్రహ్లదచారి, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, కోఆప్షన్ మెంబర్ మహబూబ్‌సాబ్ పాల్గొన్నారు.

గుండెపోటుతో వలస కూలీ మృతి



హుసేన్ గౌడ్ (ఫైల్)

గోనెగండ్ల: బతుకు దేరువు కోసం వలస వెళ్లిన కూలీని విధి చిన్న చూపుచూసింది. కూలీ పనులు చూసుకొని సాయంత్రం ఇంటికి వెళ్లి విశ్రమించగా.. గుండెపోటుతో మండల కేంద్రానికి చెందిన హుసేన్ గౌడ్(34) మృతి చెందాడు. మృతుడి భార్య విరుపాక్షమ్మ గ్రామంలో కూలీ పనులు చేసేది. హుసేన్ గౌడ్ కూలీ పనులతో పాటు ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా వెళ్లేవాడు. గ్రామంలో పనులు లేకపోవడంతో గత నెలలో గుంటూరు జిల్లా ఎన్నెగండ్ల మండలం, గార్లదిన్నె గ్రామంలో మిరప పంటను కోసే పనులకు కుటుంబంతో కలిసి వెళ్లాడు. గురువారం పగలు పనులు చేసి రాత్రి నివాసానికి చేరుకొని విశ్రాంతి తీసుకుంటుండగా.. ఆకస్మత్తుగా గుండెపోటు వచ్చింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించేలోపు మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. హుసేన్ మృతదేహాన్ని శుక్రవారం గోనెగండ్లకు తీసుకువచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి.

టైలర్లకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

కోసిగి: కోసిగి మండలంలో ఇళ్లు లేని నిరుపేద టైలర్ల ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోసిగి మండల టైలర్స్ అసోసియేషన్ నాయకులు కృష్ణ, నర్సారెడ్డి, వీరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం కోసిగిలో టైలర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దర్జీలు తహసీల్దార్ రుద్రగౌడను కలిసి ఇళ్ల స్థలాల మంజూరుపై వినతి పత్రం అందించారు. మండలంలో దాదాపు 200 కుటుంబాలు టైలర్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాయన్నారు. రెడీమెడ్ వస్త్రాల రాకతో టైలర్స్ జీవనోపాధి కష్టంగా మారిందన్నారు. వినతిపత్రం అందించిన వారిలో టైలర్లు మల్లేష్, తిక్కన్న,హరికృష్ణ, రాజేష్,ఈరేష్, రాముడు, మహేష్, మాదేవా, ఉలిగయ్య, మారయ్య తదితరులు ఉన్నారు.



తహసీల్దార్ రుద్రగౌడకు వినతి పత్రం అందజేస్తున్న టైలర్ అసోసియేషన్ నాయకులు

మైనారిటీలకు రక్షణ కరువు

ఎమ్మిగనూరుటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ద్వారా దేశంలో మైనారిటీలకు రక్షణ లేకుండా పోతోందని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అనీఫ్, రైతు కూలీ సంఘ జిల్లా కార్యదర్శి ఏసేపు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మతోన్మాద విధానాలను అమలు చేస్తుందని ఆరోపించారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. రైతు కూలీ సంఘ నాయకులు జయన్న, ఎల్లప్ప, హనుమంతు పాల్గొన్నారు.